తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ మంగళవారం 29 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3

# రేషన్ కార్డా..కాంగ్రెస్ ఐడీ కార్డా..?



## బీఆర్ఎస్ మోత్కూరు మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్

- కాంగ్రెస్ రంగులు, సీఎం, మంత్రి ఫొటోలతో ఎలా ముద్రిస్తారు
- ప్రభుత్వ కార్డుపై లబ్ధిదారుల ఫొటో, వివరాలు ఉండాలి
- ప్రభుత్వం మారితే ఆ కార్డు ఉంటుందా
- ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజావారధి/మోత్కూరు**

కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ పేరుతో లబ్ధిదారులకు ఇస్తున్నవి రేషన్‌కార్డులా లేక కాంగ్రెస్ ఐడీ కార్డులా అని బీఆర్ఎస్ మోత్కూరు మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాధనంతో ఇస్తున్న రేషన్‌కార్డులపై కాంగ్రెస్ రంగులు, సీఎం, మంత్రి ఫొటోలు ముద్రించి ఎలా ఇస్తారని, ప్రభుత్వం మారితే ఈ కార్డులు ఉంటాయా అని ప్రశ్నించారు. ప్రజాధనంతో ఇస్తున్న ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారుల ఫొటోలు, కుటుంబ సభ్యులు వివరాలు ఉంటాయని, ప్రభుత్వ రాజముద్రతో ఇస్తారని, కానీ ప్రభుత్వం ఇస్తున్న కార్డులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల గుర్తింపు కార్డుల్లా ఉన్నాయని, ఇది ముమ్మాటికీ ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనన్నారు. ప్రతి పథకానికి రేషన్‌కార్డే ప్రామాణికమని, పేదలు దేనికైనా దరఖాస్తు చేసుకోవడానికి కుటుంబ సభ్యుల వివరాలు ఉండాలంటే ఆ కార్డు మళ్లీ జిరాక్స్ సెంటర్లకు తీసుకెళ్లి ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసుకోవాల్సిందేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ లక్షల రేషన్‌కార్డులు ఇచ్చారని, వాటిపై లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాలు, రాజముద్రతోనే ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడం చేతగాక ప్రభుత్వ సొమ్ముతో ఇలాంటి చిల్లర పబ్లిసిటీ చేసుకోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబాకర్, దళితబంధు, గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ ఇలా ఏ ప్రభుత్వ పథకం అమలు చేసినా కేసీఆర్ ప్రభుత్వ అధికారిక రాజముద్రతోనే ఇచ్చారని, ఇప్పుడు మీలా ఏం చేయకున్నా ఫొటోలు వేసుకోలేదన్నారు. ఇప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెంచి ఇస్తున్న కొన్ని లక్షల పింఛన్ కార్డులపై కూడా ఫొటోలు లేకుండానే ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను ఇప్పటికే చాలా వాటిని రద్దు చేసిందన్నారు. కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పింఛన్లు పెంచి ఇవ్వాలని, రైతులకు ఎగ్గొట్టిన రైతుబంధు ఇవ్వాలని, రద్దు చేసిన రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ పథకాలను, దళితులకు ఇస్తామన్న రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పబ్లిసిటీ పిచ్చితో ప్రజాధనం దుర్వినియోగం చేయకుండా చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు.